వనువులమ్మను దర్శించుకున్న మంత్రి విశ్వరూప్


వనువులమ్మ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: భట్నవిల్లి గ్రామదేవత వనువులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారిని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుకోటి సుజాత, డీసీసీబీ డైరెక్టర్ యిళ్ల గోపాలకృష్ణ, పాటి రవి, దూనబోయిన రవికుమార్, తిరుకోటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై ప్రశ్నల వర్షం

- వాడివేడిగా అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం
- వివిధ అంశాలపై నిలదీసిన ఎమ్మెల్సీ కుడుపూడి
- పాత ఓచర్లకు బిల్లులు చెల్లించడంపై మండిపాటు


కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తదితరులు

అమలాపురం టౌన్: అధికారులపై ఏకధాటిగా ప్రశ్నల వర్షం గుప్పించారు.. సమస్యలపై కూలంకషంగా చర్చించారు.. తప్పుడు నిర్ణయాలపై మండిపడ్డారు. ఒక్క ముక్కలో చెప్పాలంటే అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాడివేడిగా జరగడంతో అధికారులకు ముచ్చెమటలు పట్టాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన మంగళవారం ఉదయం జరిగిన కౌన్సిల్ సమావేశంలో గతం కంటే భిన్నంగా దాదాపు మూడు గంటలకు పైగా పలు అంశాలపై చర్చ సాగింది. సమావేశానికి ఎక్స్ అఫిషియో సభ్యుని హోదాలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు తొలిసారిగా హాజరై అజెండాలోని పలు అంశాలపై పాలక పక్షం కౌన్సిలర్లతో కలిసి కులంకుషంగా చర్చించడంతో పాటు అధికారుల్ని నిలదీశారు. సమావేశంలో 36 అంశాలతో ఉన్న అజెండాలో ప్రతి అంశంపై లోతైన చర్చ జరిగింది.

పాత ఓచర్లకు బిల్లులెలా?

- మున్సిపాలిటీ కంపోస్టు యార్డులో బయో మైనింగ్ ప్లాంట్ నిర్మాణం కోసం చెత్త తొలగింపునకు రూ.10 లక్షలతో తయారుచేసిన అంశాన్ని కౌన్సిల్ గత సమావేశంలోనే వాయిదా వేసింది. దానిని యథాతథంగా ఈ కౌన్సిల్‌కు తీసుకురావడంపై ఎమ్మెల్సీ అభ్యంతరం చెప్పారు. తక్షణమే ఆ అంచనాలను రద్దు చేసి దాని స్థానే ఆ పనులను డిపార్ట్‌మెంట్ ఎగ్జిక్యూషన్ ద్వారా మాత్రమే చేయాలని పాలక పక్ష కౌన్సిలర్ నాగేంద్ర కౌన్సిల్ చేత తీర్మానం చేయించారు.
- జగనన్న హరిత నగరంలో భాగంగా పట్టణంలో రూ.45 లక్షలతో చేపడుతున్న పనుల్లో భాగంగా రూ.10 లక్షలతో మొక్కలు, ట్రీ గార్డుల ఏర్పాటుకు సంబంధించి అప్పటికే జరిగిన టెండరు తీరుపై ఎమ్మెల్సీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ టెండరును పూర్తిగా రద్దు చేసి రీ టెండర్‌ను అన్ని జిల్లాల కాంట్రాక్టర్లకు తెలిసేలా ప్రముఖ పత్రికలో ప్రకటనతో పిలవాలని తీర్మానించారు.
- మున్సిపాలిటీలో 2014, 2018 సంవత్సరాల్లోని పాత ఓచర్లకు గత మే నెలలో ఎలా బిల్లులు మంజూరు చేస్తారని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు ప్రశ్నించారు. ఆ రెండు సంవత్సరాల్లో దాదాపు రూ.3 లక్షల బిల్లులు దొడ్డిదారిలో మంజూరు చేయడంపై మండిపడ్డారు. ఈ చెల్లింపుల్లో ఏమైనా తేడాలున్నట్లు తేలితే కమిషనర్ నుంచి రికవరీ చేయాలని చైర్‌పర్సన్ చేత ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తీర్మానం చేయించారు.
- మున్సిపాలిటీలో పలు విభాగాలకు సంబంధించి పాలక పక్ష కౌన్సిలర్లతో వేయాల్సిన ప్యానల్ కమిటీలు ఇప్పటి వరకూ ఏర్పాటు చేయకపోవడంపై ఎమ్మెల్సీతో పాటు కౌన్సిలర్లు కమిషనర్ నాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మిమ్మల్ని సస్పెండ్ చేయాలని కౌన్సిల్ తీర్మానం చేయాల్సి వస్తుందని ఎమ్మెల్సీ మండిపడ్డారు.

మున్సిపల్ షాపుల్లోనే రైల్వే కౌంటర్

మున్సిపల్ కాంప్లెక్స్‌లోని మూడు షాపుల్లో 22 ఏళ్లుగా ఉంటున్న రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను అక్కడే కొనసాగించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. అవసరమైతే నామమాత్రపు అద్దె లేదా ఉచితంగా మున్సిపాలిటీ ఆ షాపులను రైల్వే శాఖకు ఇవ్వాలని పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు ఏకగ్రీవంగా తమ ఆమోదాన్ని తెలిపారు. కౌంటర్ అక్కడే కొనసాగించాలని హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్న దృష్ట్యా, కోనసీమకు రైల్వే లైన్ వచ్చే వరకూ ఈ కౌంటర్‌ను కొనసాగించాలని ఎమ్మెల్సీ స్పష్టం చేశారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు తిక్కిరెడ్డి వెంకటేష్, రుద్రరాజు నానిరాజు, కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, గొవ్వాల రాజేష్, సంసాని బులినాని, దొమ్మేటి రాము, దొంగ నాగ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కుడుపూడికి కౌన్సిల్ సత్కారం

అమలాపురం టౌన్: ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ ఎక్స్ అఫిషియో సభ్యునిగా నియమితులై మంగళవారం ఆ హోదాలో తొలిసారిగా మున్సిపల్ కార్యాలయానికి విచ్చేసిన సందర్భంగా ఆయనను అధికారులు, కౌన్సిల్ ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, వైస్ చైర్మన్లు తిక్కిరెడ్డి వెంకటేష్, రుద్రరాజు నానిరాజుతో పాటు పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


కుంచేనపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న శ్రీనివాస్

కాట్రేనికోన: మండలంలోని కుంచేనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నడవపల్లికి చెందిన దాత కర్రి శ్రీనివాస్ విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. విద్యార్థులకు పుస్తకాలు సమకూర్చుతున్న శ్రీనివాస్‌ను ప్రముఖ రచయిత చింతా రాంబాబు అభినందించారు. కార్యక్రమంలో కర్రి రాంబాబు, అరుణ, సీత, సతీష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పరామర్శ


రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి విశ్వరూప్

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.కొత్తపల్లి పంచాయతీ కొంకివారిపేటకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కొంకి రమేష్ మంగళవారం ఆకస్మిక మృతి చెందాడు. రమేష్ కుటుంబాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ మంగళవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పరామర్శించిన వారిలో సొసైటీ అధ్యక్షుడు ఎస్.వెంకట సుబ్బరాజు, బొడ్డు నాగేశ్వరరావు, కుంచే చిన్ని తదితరులున్నారు.

కుండలేశ్వరస్వామి సన్నిధిలో చాగంటి దంపతులు


కుండలేశ్వరుని దర్శించుకున్న చాగంటి దంపతులు

కాట్రేనికోన: వృద్ధ గౌతమీ నదీ తీరాన కుండలేశ్వరంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత కుండలేశ్వరస్వామి వారిని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. చాగంటి తన జన్మదినాన్ని పురస్కరించుకుని స్వామి వారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. చాగంటి దంపతులకు తొలుత అర్చకుడు కాళ్ళకూరి కామేశ్వరశర్మ ఆధ్వర్యాన ఆలయ పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనానంతరం స్వామి వారి శేషవస్త్రాలను చాగంటి దంపతులకు అందజేసి, ఆశీర్వదించారు. ఈ సందర్భంగా చాగంటి మాట్లాడుతూ కుండలేశ్వరుని దర్శనం అనంత కుండలాల ఫలాన్నిస్తుందని అన్నారు.

నవరత్నాలతో రాష్ట్రంలో నవశకం

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- లక్ష్మీదేవిలంకలో గడప గడపకూ...


లక్ష్మీదేవిలంకలో గడప గడపకూ కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

ముమ్మిడివరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల పథకాలతో రాష్ట్రంలో నవశకం వచ్చిందని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ముమ్మిడివరం మండలం అన్నంపల్లి శివారు లక్ష్మీదేవిలంకలో మంగళవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ హయాంలో రాష్ట్రంలో ప్రతి పేదవాడికి నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మధ్యవర్తులు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే సంక్షేమ నిధులు చేరవేస్తున్నామని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో అనేక సమస్యలకు శాశ్వత పరిష్కారానికి శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, గ్రామ సర్పంచ్ మట్టపర్తి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ పాము నాగవేణి, జెడ్పీటీసీలు కుడిపూడి శంకరరావు, నేల కిశోర్, కోలా బాబ్జి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెన్మత్స చిట్టిరాజు, పాము చిట్టిబాబు, నూకరాజు, గ్రామ సర్పంచ్‌లు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు వర్తింపు


అల్లవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న శ్రీకాంత్

అల్లవరం: కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ అన్నారు. అల్లవరం-1 సచివాలయంలో మంగళవారం రెండో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చొరవ తీసుకుంటున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన అందిస్తున్నారని, రానున్న ఏడాది కాలంలో అమల్లో ఉన్న సంక్షేమ పథకాల కొనసాగింపుతో పాటు మరిన్ని అభివృద్ధి పనులు చేపడతారని చెప్పారు. సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ పారదర్శకంగా చేరాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, ప్రజలు ఆయన్ని దీవించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, మండల పార్టీ అధ్యక్షులు కొనుకు బాపూజీ, సర్పంచ్ బొమ్ము బాలవేణి, ఎంపీటీసీ నిచ్చెనకోళ్ల మౌనిక, సొసైటీ అధ్యక్షులు యల్లమిల్లి బోసు, గృహసారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్, యూత్ అధ్యక్షుడు దాసం రాంబాబు, ప్రధానకార్యదర్శి వాసంశెట్టి నరసింహరావు, గ్రామకమిటీ కార్యదర్శి గోసంగి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాలవెల్లువ కేంద్రాలను వినియోగించుకోండి

అల్లవరం: జగనన్న పాల వెల్లువ కేంద్రాలను పాడి రైతులు వినియోగించుకోవాలని పశువైద్యాధికారి నారాయణరావు సూచించారు. సర్పంచ్‌లు సాధనాల వెంకటరావు, రొక్కాల విజయలక్ష్మిల అధ్యక్షతన దేవగుప్తం, బోడసకుర్రు గ్రామాల్లో జగనన్న పాల వెల్లువపై పాడి రైతులకు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గ్రామంలో 11 మంది పాడి రైతులతో సహకార సొసైటీ ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఏపీఎం సయ్యద్, ఈఓపీఆర్డీ వెంకటేశ్వరరావు, పి.శ్రీమన్నారాయణ, శ్రీనివాస్, పి.శ్రీను పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలోనే విద్యాభివృద్ధి

ఉప్పలగుప్తం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే విద్యాభివృద్ధికి పెద్దపీట వేశారని సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ అన్నారు. మండలంలోని గొల్లవిల్లి, భీమనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అమ్మ ఒడి, మధ్యాహ్నం భోజన పథకం, జగనన్న విద్యాకానుక, ఆణిముత్యాలు, నాడు-నేడు అభివృద్ధి వంటి అంశాలపై తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఎల్ రాణి, ఎస్.సత్యన్నారాయణ, పీఎంసీ చైర్మన్‌లు సబ్బతి జ్యోతి, డి.వెంకటరమణ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఐ.పోలవరం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టిందని ఎంపీడీఓ డి.రాంబాబు అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంపై మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా జులై 1 నుంచి అధికారుల సమక్షంలో లబ్ధిదారులకు 11 రకాల ధ్రువపత్రాలు ఉచితంగా జారీ చేస్తామన్నారు.

మన్నాకాలనీ ప్రజలంతా వైఎస్సార్ సీపీ వెంటే


ఐక్యతను చాటిన మన్నా కాలనీ గ్రామస్తులు

అల్లవరం: స్వాతంత్య్రం వచ్చిన 75 ఏళ్ల తర్వాత మాదిగ సామాజికవర్గానికి శాసనమండలి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వెంటే ఉంటామని కొమరగిరిపట్నం శివారు మన్నా కాలనీ శాంతినగర్‌కు చెందిన ప్రజలు మంగళవారం తెలిపారు. ఇటీవల ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఆధ్వర్యంలో కాలనీవాళ్లందరూ పార్టీలో చేరితే, తమ కాలనీకి సంబంధం లేని వారు ప్రలోభాలకు లోబడి తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని మల్లవరపు రాఘవులు, ఉండ్రాజవరపు చంటి, యేసు, నూటుకుర్తి బులిరాజు, నూటుకుర్తి మోహన్ తెలిపారు.

లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం


మహిళలకు కుట్టు మిషన్లు, వెట్ గ్రైండర్లు అందిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్

తాళ్లరేవు: సమాజంలోని పేదలకు లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక లయన్స్ క్లబ్ హాలులో మెగా సేవా మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తాళ్లరేవు, గొల్లపాలెం లయన్స్ క్లబ్‌ల ద్వారా ఏడుగురు నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లు, ముగ్గురికి వెట్ గ్రైండర్లను ఎమ్మెల్యే పొన్నాడ చేతుల మీదుగా అందజేశారు. రిటైర్డ్ మాస్టర్ దంగేటి వెంకటరమణ కుటుంబసభ్యులు ఐసీయూ బెడ్, వీల్‌చైర్‌లను పేద రోగుల ఉపయోగార్థం బహూకరించారు. తాళ్లరేవు శ్మశాన వాటిక అభివృద్ధికి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి రూ.50 వేల విరాళాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ బ్రహ్మార్పణ్ కార్యక్రమంలో భాగంగా అభాగ్యులకు భోజనాలు వండి వడ్డించడం తదితర ప్రజోపయోగ కార్యక్రమాలు చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులను ఎమ్మెల్యే పొన్నాడ అభినందించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, స్థానిక సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి, లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ వేలూరి సూర్యనారాయణ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యా పథకాలపై తల్లిదండ్రులకు అవగాహన

అమలాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు విద్యా పథకాలపై స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. మంగళవారం పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు ఎస్.నాగవల్లి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జగనన్న ఆణిముత్యాలు, జగనన్న విద్యా కానుక, గోరు ముద్ద, నాడు-నేడు, రాగి జావ, మధ్యాహ్న భోజన పథకం తదితర పథకాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొని ఆయా విద్యా పథకాల ద్వారా అందుతున్న లబ్ధిపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యా పథకాలతో తమ పిల్లల్లో ఆత్మ విశ్వాసం, పెరిగిందని తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వహణ కమిటీ అధ్యక్షురాలు రాయి దుర్గాదేవి, చిత్రలేఖన ఉపాధ్యాయుడు పి.నాగేశ్వరరావు, పీడీ గౌరీ శంకర్‌లు ప్రసంగించారు.

అలసత్వం వహిస్తే సహించేది లేదు

కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ ప్రవీణ్‌కుమార్


సమావేశంలో చర్చిస్తున్న కౌన్సిల్ సభ్యులు

ముమ్మిడివరం: నగర పంచాయతీ పరిధిలో పారిశుధ్యం విషయంలో అధికారులు, సిబ్బంది అలసత్వం వహిస్తే సహించేది లేదని నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. నగర పంచాయతీ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన కౌన్సిల్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. అజెండాలోని అంశాలపై చర్చిస్తుండగా కౌన్సిలర్లు బొంతు సత్యశ్రీనివాస్, గంజా శ్రీనివాస్‌లు మాట్లాడుతూ సచివాలయ శానిటరీ కార్యదర్శులు విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదన్నారు. తాము దగ్గరుండి పని చేయిస్తుంటే పారిశుధ్య కార్మికులు తమను వేధిస్తున్నారంటూ ఫిర్యాదు చేస్తున్నారని శానిటరీ కార్యదర్శులు సంజాయిషీ ఇచ్చారు. దీనిపై చైర్మన్ ప్రవీణ్ స్పందిస్తూ సమస్యలుంటే కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాలి గాని పారిశుధ్యం విషయంలో అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. నేషనల్ హైవే నుంచి మార్కెట్ యార్డుకు వెళ్లే పుంత రోడ్డు ఆధునీకరణకు మార్కెట్ కమిటీ రూ.25 లక్షలు మంజూరు చేసి నెల రోజులైనా నగర పంచాయతీ ఆమోదానికి ప్రతిపాదనలు ఎందుకు రూపొందించలేదని అధికార పార్టీ కౌన్సిలర్ బొంతు సత్య శ్రీనివాస్ రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులను నిలదీశారు. దీనిపై చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ స్పందిస్తూ సంబంధిత అధికారులపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో కమిషనర్ జి.లోవరాజు, వైస్ చైర్మన్ వేటుకూరి బోసురాజు, కౌన్సిలర్లు అడబాల సతీష్‌కుమార్, కట్టా ఉమామహేశ్వరి పాల్గొన్నారు.